క్లుప్తంగా

ప్రజా సమస్యలు పరిష్కరించండి


కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

కదిరి టౌన్: పట్టణంలోని ప్రజా సమస్యలు పరిష్కరించాలని కౌన్సిలర్లు కోరారు. సోమవారం కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీషా అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు మాట్లాడుతూ వార్డుల్లో చెత్తాచెదరం పేరుకుపోవడంతో దోమలు ఎక్కువై జ్వరాలబారిన పడే అవకాశం ఉందన్నారు. మున్సిపాలిటీలో డీజిల్ పేరుతో లక్షలాది రూపాయలు దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ తీర్మానం లేనిదే కొత్తగా కాంట్రాక్ట్ ఉద్యోగులను తీసుకోరాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, వైస్ చైర్‌పర్సన్ కొమ్ము గంగాదేవి, డీఈలు, ఏఈలలతో పాటు సీఐ నారాయణరెడ్డి, అన్ని శాఖలు అధికారులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నల్లచెరువు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడుగా పి.నరేష్ కుమార్, అధ్యక్షుడుగా ఎస్.రమణప్పనాయుడు, ఉపాధ్యక్షుడిగా పి.గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.వసుంధర, కోశాధికారిగా ఎస్.షబ్బీర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంవీఆర్‌పీఎస్ ఉమ్మడి జిల్లా సమన్వయకర్తగా నరేష్


నరేష్

ధర్మవరం: మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి (ఎంవీఆర్‌పీఎస్) ఉమ్మడి జిల్లా (అనంతపురం, శ్రీసత్యసాయి) సమన్వయకర్తగా ధర్మవరానికి చెందిన చింతకాయల నరేష్‌ను ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కొండన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధిలో వెనుకబడిన వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే విధంగా ఉద్యమాన్ని సంఘం తరఫున ఉధృతం చేస్తామన్నారు. అందులో భాగంగా కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

తనకల్లు: విద్యతోనే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. కోటపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం 'బేటీ బచావో- బేటీ పడావో' కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకోవడం ద్వారా వారికి కుటుంబంతో పాటు సమాజంలోనూ మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణ, మహిళా కార్యదర్శులు రిహానా, ఫాతిమా, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

అమడగూరు: మండల పరిషత్ కార్యాలయంలో రేపు బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులతో పాటుగా ప్రజాప్రతినిధులందరూ హాజరు కావాలని కోరారు.

విద్యా వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి


ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న వేమయ్యయాదవ్

కదిరి అర్బన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు వేమయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరించే విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టే విధంగా విద్యార్థులు పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి లియాఖత్, మధునాయక్, అశోక్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరణ

తలుపుల : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కార్యదర్శి మహేంద్ర, మాజీ కార్యదర్శి అశోక్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు.

బీసీ న్యాయవాదులకు ఇళ్ల స్థలాలివ్వండి

ధర్మవరం రూరల్: బీసీ న్యాయవాదులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని రాష్ట్ర బీసీ న్యాయవాదుల సంఘం కన్వీనర్ సాకే నరేష్ డిమాండ్ చేశారు. సోమవారం ధర్మవరంలోని ఎన్జీఓ హోంలో జరిగిన బీసీ న్యాయవాదుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ న్యాయవాదులకు 3 సెంట్ల స్థలం కేటాయించి, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మేకల రామాంజినేయులు, ఉపాధ్యక్షులు కురుబ బన్నీల మహేష్, ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

మసకబారిన నిఘా నేత్రాలు

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం. కెమెరా పరిధిలో చీమ చిటుక్కుమన్నా పసిగట్టే శక్తి వాటి సొంతం. ఆ నిఘా నేత్రం నుంచి నేరస్తులెవరూ తప్పించుకోలేరు. అలాంటి సీసీ కెమెరాల నిర్వహణపై పోలీసు ఉన్నతాధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- చెలరేగుతున్న చోరులు
- పట్టణంలో పెరిగిన చోరీలు
- పట్టించుకోని పోలీసు అధికారులు


జీవిమాను సర్కిల్‌లో పనిచేయని సీసీ కెమెరాలు


పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో అలంకారప్రాయంగా మారిన సీసీ కెమెరాలు

కదిరి టౌన్: నేరాల అదుపు, నిందితుల గుర్తింపు, కేసుల ఛేదింపు, అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా ఉంచే సీసీ కెమెరాలు కదిరి పట్టణంలో పనిచేయడం లేదు. దీంతో నేరాలు పెరిగిపోతున్నాయి. ఇందులో చోరీలు ఎక్కువగా ఉంటున్నాయి. పోలీసుల అధికారుల పర్యవేక్షణ లోపమే ఇందుకు ప్రధాన కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు. పట్టణ నలు దిశలా కాలేజ్ సర్కిల్, ఇందిరాగాంధీ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, ఆర్‌ఎస్ రోడ్డు, బస్టాండ్ ఏరియా, టవర్‌క్లాక్, జీవిమాను సర్కిల్, హిందూపురం సర్కిల్, చౌక్ తదితర ప్రాంతాల్లో 27 సీసీ కెమెరాలు అమర్చారు. అయితే అవి పనిచేస్తున్నాయా లేదా అని కూడా పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో ఒకటి రెండు మినహా మిగిలినవేవీ పనిచేయడం లేదని తెలుస్తోంది.

రెచ్చిపోతున్న చోరులు

నిఘా నేత్రాలు పనిచేయకపోవడం చోరులకు కలిసి వస్తోంది. తమను ఎవరూ గుర్తు పట్టలేరని దొరికినంత దోచుకుపోతున్నారు. అడపాలవీధిలో ఒకే రోజు మూడు ఇళ్లలో రూ.2 లక్షల నగదు, 28 తులాల బంగారు ఆభరణాలు, ఒక ద్విచక్రవాహనం చోరీ అయ్యాయి. నెల క్రితం రాయచోటి రోడ్డులో ఉన్న వైన్స్ షాపులో దాదాపు రూ.2 లక్షల విలువ చేసే మందులు ఎత్తుకెళ్లారు. ఈ నెల ఐదో తేదీన మదనపల్లి బైపాస్ రోడ్డులో ఉన్న యామిని మెడికల్ స్టోర్‌లో రూ.11 లక్షల నగదు, రెండు కేజీల వెండి నగలు అపహరణకు గురయ్యాయి. కదిరి బస్టాండు ప్రాంతంలో దాదాపు 23 ద్విచక్రవాహనాలు చోరీ అయ్యాయి.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. సీసీ కెమెరాలు అమర్చి.. చోరీలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది. ఏవైనా కెమెరాలు పనిచేయకపోతే రిపేరీ చేయించాలి.

–జీఎల్ నరసింహులు, కదిరి

దొంగలకు పండుగే



సీసీ కెమెరాలు లేకపోయినా, పనిచేయకపోయినా దొంగలకు పండుగే. గతంలో బస్టాండ్ ప్రాంతంలో దాదాపు 23 ద్విచక్రవాహనాలు చోరీకి గురయ్యాయి. నిందితుల గుర్తింపు, బైక్‌ల రికవరీ పోలీసులకు కష్టంగా మారింది.

–కదిరప్ప, కదిరి

రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తాం



నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపులో సీసీ కెమెరాల పాత్ర చాలా కీలకం. పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. ఇదివరకు అమర్చిన కెమెరాలు ఎందుకు పనిచేయలేదో తెలుసుకుంటాం. పనిచేయని వాటిని మరమ్మతు చేయిస్తాం. చోరీలను అరికడతాం.

– నారాయణరెడ్డి, సీఐ, కదిరి అర్బన్

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు


వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఏపీ బయో డైవర్సిటీ బోర్డు (గుంటూరు), పాఠశాల విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో 'జీవ వైవిధ్య పరిరక్షణలో యువత పాత్ర' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వక్తృత్వ పోటీల్లో ప్రథమ స్థానంలో హేమావతి (జెడ్పీహెచ్‌ఎస్ కుమ్మరవాండ్లపల్లి), ద్వితీయ స్థానంలో గాయత్రి (ప్రభుత్వ ఉన్నత పాఠశాల తలుపుల), తృతీయ స్థానంలో గణేష్ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల కదిరి) నిలిచారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానంలో ఆసీఫా ఫాతిమా (జెడ్పీహెచ్‌ఎస్ గరల్స్ కదిరి), ద్వితీయ స్థానం జస్మిత (జీహెచ్‌ఎస్ తలుపుల), తృతీయ స్థానం హరిప్రసాద్ (జీహెచ్‌ఎస్ తనకల్లు) నిలిచారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్, హెచ్‌ఎం లియాఖత్, ఏపీఎస్‌జీఓ డివిజనల్‌కో ఆర్డినేటర్ ప్రభాకర్, న్యాయనిర్ణేతలు మూర్తి రాజు, మదన్‌మోహన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి


ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ

కదిరి అర్బన్: యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు జనజాగృతి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు 'మీకు తెలుసా' పేరిట హెచ్ఐవీ/ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ మేరకు ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత తెలిపారు. కార్యక్రమంలో జనజాగృతి ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రోగుల్లో భరోసా నింపాలి

బత్తలపల్లి: సమాజంలో ఎయిడ్స్ రోగుల పట్ల ఆదరణ, సానుకూల దృక్పథం చూపుతూ వారిలో భరోసా నింపాలని వక్తలు పేర్కొన్నారు. సోమవారం బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఝాన్సీలక్ష్మీ కమ్యూనిటీ ఆర్గనైజేషన్ సంస్థ పీడీ నాగమణి అధ్యక్షతన ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ భారతి, పీహెచ్‌సీ వైద్యాధికారి తేజశ్రీ మాట్లాడుతూ ముఖ్యంగా హెచ్ఐవీ వచ్చిన వారిపట్ల సానుకూలత కనబరుస్తూ వారికి మేమున్నామని భరోసా ఇచ్చినప్పుడే వారు ఆరోగ్యంగా జీవించగలరన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, విహాన్ సిబ్బంది సతీష్, జయలక్ష్మీ, మంజునాథ, ఆదిలక్ష్మీ పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం


ఎన్పీకుంటలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు

ఎన్పీకుంట: పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా సర్పంచులు, కార్యదర్శులు పని చేయాలని ఎంపీపీ రాము సూచించారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం పంచాయతీల విధులు, బాధ్యతలు అంశంపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు ఇచ్చారు. ఈఓఆర్డీ మనోహర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలోని వివిధ రకాల విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, చెత్తసేకరణ, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, వర్మీకంపోస్టు తయారీ, పంచాయతీల అభివృద్ధి కోసం ప్రణాళికల రూపకల్పన తదితర అంశాలపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమం మరో రెండు రోజుల పాటు నిర్వహిస్తారన్నారు. అనంతరం పంచాయతీల అభివృద్ధిపై ప్రతిజ్ఞ చేశారు.

ముదిగుబ్బ: పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో రిఫ్రెషర్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణకు తొలిరోజు ఎంపీడీఓ కవిరాజ్ హాజరై పంచాయతీ విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు.

గాండ్లపెంట: గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సోమవారం గాండ్లపెంట మండల పరిషత్ కార్యాలయంలో 14 గ్రామపంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు ఎంపీడీఓ రామానాయక్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సునిత తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచులు, ఎంపీటీసీలకు శిక్షణ నిర్వహించారు. ఎంపీపీ పర్వీన్‌భాను అధ్యక్షతన ఏర్పాటు చేసిన శిక్షణలో పారిశుధ్యం, వేస్ట్ మేనేజ్‌మెంట్ గురించి వివరించారు. సమావేశంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు జగన్‌మోహన్‌చౌదరి, సర్పంచు గోవిందు, తొట్లి రంగారెడ్డి, బాబా ఫక్రుద్దీన్, అబీదాబీ, షాజియా, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలు రూపొందించుకోవాలి

కనగానపల్లి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనిల్ కుమార్, ట్రైనర్స్, పలువురు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

విధులు, బాధ్యతలపై అవగాహన

బత్తలపల్లి: పంచాయతీ సర్పంచులు విధులు, బాధ్యతలు తెలుసుకున్నపుడే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ సాయిమనోహర్ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సాయిమనోహర్ అధ్యక్షతన మండలంలోని ప్రజాప్రతినిధులు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ ప్రారంభించారు. ఈఓఆర్డీ దివాకర్, ఏఓ శ్రీదేవి, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభలు

గాండ్లపెంట: ఉపాధి హామీ పథకం కింద గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు మండల వ్యాప్తంగా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించి సోమవారం సోమయాజులపల్లి, కురుమామిడిలో గ్రామసభలు నిర్వహించారు. ఈ నెల 14 వరకు గ్రామసభలు కొనసాగుతాయని ఎంపీడీఓ రామానాయక్ తెలిపారు.

17న స్కూల్ కమిటీ ఎన్నికలు

ధర్మవరం రూరల్: వాయిదా పడిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ఈ నెల 17న నిర్వహించనున్నట్లు ఎంఈఓ గోపాల్ నాయక్, ప్రధానోపాధ్యాయురాలు మాధవి దేవరకొండ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాయిదా పడిన మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల, రేగాటిపల్లి పాఠశాలల ఎస్ఎంసీలకు ఎన్నికలు జరుగుతాయన్నారు.

కాశీ విశ్వేశ్వరుడికి పూజలు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో పూజలు చేపట్టారు.

17న ఉచిత కంటి వైద్య శిబిరం

కనగానపల్లి: తగరకుంటలో ఈ నెల 17న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. కడప పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సర్పంచ్ మాధవరాజులు సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

నిరుపేద క్రీడాకారులకు చేయూత


క్రీడా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

ధర్మవరం: నిరుపేద క్రీడాకారులకు చేయూతనందించడమే లక్ష్యంగా ఆత్మీయ ట్రస్ట్ పని చేస్తోందని ట్రస్ట్ సభ్యులు రామిరెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ధర్మవరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులకు బాల్ బ్యాడ్మింటన్ బ్యాట్‌లు, బాల్స్, గట్రోల్ కిట్‌లను పంపిణీ చేశారు. ఉన్నత పాఠశాల పీడీ నాగేంద్ర అభ్యర్థన మేరకు క్రీడాకారులకు ఉచితంగా క్రీడాసామగ్రి అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శైలజ, హిందీ పండిట్ వేణుగోపాల్, ప్రసాద్, బాబు, శ్రీనివాసులు, సునితమ్మ, లీలావతి, హరికృష్ణ, రామాంజినేయులు పాల్గొన్నారు

జీవో 117ను రద్దు చేయండి

ముదిగుబ్బ: జీఓ 117ను వెంటనే రద్దు చేసి, జీఓ 53 ప్రకారం ఉపాధ్యాయుల పనిని సర్దుబాటు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు నాగేంద్ర, పీరు నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ముదిగుబ్బ ఎంఈఓలకు వినతిపత్రం అందజేశారు.

ముస్లిం హక్కులను కాలరాస్తోన్న బీజేపీ

తనకల్లు: ముస్లింల హక్కులను బీజేపీ కాలరాస్తోందని మైనార్టీ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు షాకీర్‌ఖాన్ విమర్శించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వక్ఫ్ చట్టాన్ని సవరణ చేయడం ద్వారా బోర్డును నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దారుణమని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీల ఎంపీలు బిల్లును అడ్డుకోవడంతో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ జాయింట్ కమిటీకి పంపిందని తెలిపారు. సవరణ బిల్లుకు టీడీపీ ఎంపీలు మద్దతు ప్రకటించడం ముస్లింలను మోసం చేయడమేనని విమర్శించారు.

సమస్యలు తలెత్తకుండా చూడాలి

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఈఓఆర్డీ అశోక్‌కుమార్ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో మండలంలోని గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

పెయ్య దూడల ద్వారా పాడి అభివృద్ధి


గర్భకోశ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కనగానపల్లి: పెయ్య దూడలను మాత్రమే ఇవ్వగలిగే లింగనిర్ధారత పరీక్షల ద్వారా పాడి పశువుల అభివృద్ధిని పెంపొందిస్తున్నట్లు జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి డాక్టర్ సుధాకర్ తెలిపారు. సోమవారం మండలంలోని రాంపురం గ్రామంలో పాడి పశువుల గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు పాడి ఆవులకు ఉచిత గర్భకోశ చికిత్సలు చేయించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి సునీల్‌కుమార్, సర్పంచ్ అంకె రామకృష్ణ, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, స్థానిక పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పని సర్దుబాటు ప్రక్రియ వెంటనే ఆపాలి


అమడగూరులో ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

అమడగూరు: ప్రభుత్వం చేపట్టిన పని సర్దుబాటు ప్రక్రియను వెంటనే ఆపాలని ఫ్యాప్టో పిలుపునిచ్చింది. సోమవారం ఎస్టీయూ నాయకులు ఎమ్మార్సీ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. నాయకులు మాట్లాడుతూ పని సర్దుబాటు ప్రక్రియను వెంటనే ఆపకపోతే భవిష్యత్ ఆందోళనలకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. పని సర్దుబాటును అందరూ బాయ్‌కాట్ చేస్తున్నామన్నారు. అనంతరం ఎంఈఓ జిలాన్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సుధాకర్, ఈశ్వర్, నారాయణస్వామి, శ్రీనివాసరెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు నారాయణ, సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు సహదేవరెడ్డి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓడీచెరువు : ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని సోమవారం ఎంఈఓ సురేష్ బాబుకు ఫ్యాప్టో నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో కో చైర్మన్ గౌస్‌లాజమ్, శ్రీనివాసులు, రాంకుమార్, సుధాకర్, చంద్రమౌళి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఎన్పీకుంట: ఉద్యోగ సంఘాల సూచనలను పెడచెవిన పెడుతూ ప్రభుత్వం చేపడుతున్న అసంబద్ధ పని సర్దుబాటు ప్రక్రియను వెంటనే ఆపాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఉపాధ్యాయ సంఘాలతో కలిసి ధర్నా నిర్వహించి, ఎంఈఓకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కౌన్సిలర్ రమణానాయక్, మురళీ, శివయ్య, షరీఫ్, షఫీ, ముషీర్ అహ్మద్, వెంకటరమణారెడ్డి, రమణయ్య, రహీం, వెంకటరామిరెడ్డి, రామ్మోహన్, లాలూసాబ్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి


ఎంపీడీఓ బి.శకుంతల

నల్లచెరువు: ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న రాణెమ్మ కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్లారు. దీంతో ఆమె స్థానంలో నల్లచెరువు నూతన ఎంపీడీఓగా కర్నూలు జిల్లా సి.బెళగల్ నుంచి బదిలీపై వచ్చిన బి.శకుంతల సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు.

ఎంపీడీఓగా మునెప్ప


ఎంపీడీఓ మునెప్ప

అమడగూరు: ఎంపీడీఓగా మునెప్ప సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికలకు ముందు ఈయన ఇక్కడి నుంచి ఈసీ ఆదేశాల మేరకు వేరొక జిల్లాకు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా అశోక్‌కుమార్‌రెడ్డి వ్యవహరించేవారు. తాజాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మునెప్ప తిరిగి అమడగూరుకు బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జ్ అశోక్‌కుమార్‌రెడ్డి సోమవారం రిలీవ్ అయ్యారు.

రత్నాకర్‌ను కలిసిన తహసీల్దార్


రత్నాకర్‌కు మొక్క అందజేస్తున్న తహసీల్దార్

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి నూతన తహసీల్దార్ అనుపమ సోమవారం ప్రశాంతి నిలయంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం స్థానిక సమస్యలపై కాసేపు చర్చించారు.

సమస్యలు పరిష్కరించండి


సమస్యలు తెలుసుకుంటున్న పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి: ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రేషన్‌కార్డులు, తాగునీరు, ఇంటి స్థలాలు కావాలని ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హమీద్ బాషాతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

చిలమత్తూరు: మండలంలోని చాగలేరులో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధరదేవి సోమవారం ప్రారంభించారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు వీలుగా దాదాపు రూ.2 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసినట్టు ఆమె పేర్కొన్నారు. ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు శ్రీనివాసరావు, సురేంద్రబాబు, బాలాజీ, మండల కన్వీనర్ రంగారెడ్డి, శ్రీదేవి, గంగాధర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కనగానపల్లి: వివిధ రకాల పుస్తకాలు, పత్రికల ద్వారా విజ్ఞాన సంపదను అందించే గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మండల గ్రంథాలయాధికారి గోవిందు తెలిపారు. స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో సోమవారం జాతీయ లైబ్రరీయన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి గ్రంథాలయ సిబ్బంది పూలమాలలు నివాళులు అర్పించారు. మొదటి లైబ్రరీయన్ రంగనాథన్ గురించి పాఠకులకు వివరించారు. గ్రంథాలయాల అభివృద్ధిలో లైబ్రరీయన్ల పాత్రను తెలిపారు.

ధర్మవరం రూరల్: పట్టణంలోని గ్రంథాలయంలో సోమవారం నేషనల్ లైబ్రేరియన్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రంగనాథన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అంజలీ సౌభాగ్యవతి, సిబ్బంది సత్యనారాయణ, శివమ్మ, రమణ పాల్గొన్నారు.